క్లుప్తంగా

కరపత్రాలు విడుదల



అయిజ: అంబేద్కర్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను పోలీస్‌స్టేషన్ ఎదుట ఎస్ఐ నరేష్‌కుమార్ విడుదల చేసి మాట్లాడారు. అంబేద్కర్ అందరివాడని పేర్కొన్నారు.

సీపీఎస్ విధానంతో నష్టం



గద్వాల అర్బన్: సీపీఎస్ విధానంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నష్టం కలుగుతుందని సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు అన్నారు. ఈ నెల 16న జిల్లా కేంద్రంలో పాత పింఛన్ విధానం అమలు కోసం ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. జిల్లాలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నర్సింహ్మ, రమేష్, సూర్యప్రకాశ్, పరుశరాముడు, శ్రీధర్ గౌడ్, సందీప్ తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

గద్వాల అర్బన్: ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ రెండు పూటలు నడుపుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సామాజిక ఉద్యమకారులు నాగరాజు, నరేషలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో విద్యాశాఖ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం పాఠశాలలను ఒంటి పూట బడి కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా రెండు పూటలు కొనసాగిస్తున్నాయని వివరించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు, మెన్నిపాడు గ్రామ శివారులలో మొత్తం 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వీరభద్రప్ప తెలిపారు. తంగభద్ర నది తీరం నుంచి ఇసుక రవాణాను అరికట్టేందుకు పుల్లూరులో 4, మెన్నిపాడు గ్రామ శివారులో 4 కెమెరాలను బిగించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎవరైన అక్రమంగా ఇసుక తరలిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

రేపు ట్రస్మా సర్వసభ్య సమావేశం

గద్వాల న్యూటౌన్: ఈనెల 14వ తేదీ ఉదయం 9 గంటలకు తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్ల(ట్రస్మా) సర్వసభ్య సమావేశాన్ని స్థానిక టూరిజం హోటల్‌లో ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మాకం బీచుపల్లి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, కోశాధికారి రమణారావు హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్‌లు హాజరు కావాలని యన కోరారు.

మట్టి తరలింపునకు అనుమతి

ఉండవెల్లి: మండలంలోని శేరుపల్లె, ప్రాగటూరు గ్రామ శివారులోని శ్రీశైలం ముంపు పొలాల మట్టి తరలింపునకు జిల్లా ఇరిగేషన్ అధికారి విజయ్ కుమార్ అనుమతి ఇచ్చినట్లు తహసీల్దార్ వీరభద్రప్ప బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దాదాపు 2000 ట్రాక్టర్ల ట్రిప్పులకు 13 మంది రైతులకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. స్థానికులు సహకరించాలని కోరారు.

రెగ్యులరైజ్ చేయాలి

ఉండవెల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని కార్యదర్శులు రవి గౌడ్, శివశంకర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రొబేషన్ పిరియడ్ నాలుగేళ్లు పూర్తైన సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో శివ, ధనుంజయ్ రెడ్డి, అశోక్, దేవి దేవిక, బాలకృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

అందని 'పల్లె' వైద్యం

- నియోజకవర్గంలో 38 పల్లె దవాఖానాలు
- కంటి వెలుగుకు వైద్యుల కేటాయింపు



ఉండవెల్లిలో పల్లె దవఖానాను సందర్శించిన రాష్ట్ర నోడల్ అధికారులు(ఫైల్)

ఉండవెల్లి: గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య ఉప కేంద్రాలను పల్లె దవాఖానాగా మార్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంది. అవసరమైన వైద్య సిబ్బందిని, వసతులను సమకూర్చింది. అంతాబాగానే ఉన్నా పల్లె దవాఖానాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని కంటి వెలుగు కార్యక్రమానికి కేటాయించడంతో పల్లె వైద్యం అందక రోగులు అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రిలో సిబ్బందిలేక పోవడంతో దవాఖానాలు వెలవెలబోతున్నాయి.

నియోజక వర్గంలో 38 పల్లె దవాఖానాలు

ప్రతి మండలంలో కనీసం రెండు చొప్పున 7 మండలాల్లో 38 పల్లె దవాఖానాలను ఏర్పాటు చేసి ఏఎన్ఎంలను నియమించారు. గ్రామీణ ప్రాంతాల వారికి వైద్యం అందించేందుకు ఆయూష్ డాక్టర్లను నియమించారు. మండల కేంద్రాలలో ఉన్న పీహెచ్‌సీలో పని చేస్తున్న వైద్యులు కూడా బదిలీలపై వెళ్లడంతో అక్కడ సూపర్‌వైజర్లే వైద్యులుగా ఉన్న దుస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాలకు వైద్యం అందక అలంపూర్ నియోజక వర్గంలోని ప్రజలు కర్నూల్, రాయచూరు, గద్వాల్‌కు, హైదరాబాద్‌కు పయనిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

రోగులు అవస్థలు తెలిసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



గ్రామం నుంచి క్యాతూరు పీహెచ్‌సీకి, అలంపూర్ ఆస్పత్రికి, మానవపాడు ఆస్పత్రికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. దూరభారంతో అవస్థలు ఎదుర్కొంటున్నాం. కర్నూల్ వెళ్లి ప్రైవేట్ దవాఖానాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి పల్లె దవాఖానాల్లో వైద్యులను ఏర్పాటు చేయాలి.

– చాంద్‌బాషా, మారమునగాల–2

ఆస్పత్రిని ప్రారంభించాలి



అలంపూర్ చౌరస్తాలో నిర్మిస్తున్న ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలి. పల్లె దవాఖానాలలో వైద్యులు లేకపోవడంతో వైద్యం కోసం కర్నూలు వెళ్తున్నాం. రోగులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు చర్యలు తీసుకోవాలి. వైద్యులను నిరంతరం అందుబాటులో ఉంచాలి. .

– వెంకటరాముడు, జులకల్, వడ్డెపల్లి

త్వరలో వైద్యులను ఏర్పాటు చేస్తాం

ప్రతి మండలంలో కంటి వెలుగు కార్యక్రమాలకు వైద్యులను ఏర్పాటు చేశాం. కార్యక్రమంలో పూర్తై వెంటనే పల్లె దవాఖానాలకు వైద్యులను కేటాయిస్తాం. గ్రామీణ ప్రాంతాల వారికి వైద్యం అందించేందుకే ఆయుష్ డాక్టర్లను నియమించాం. కొందరు వైద్యులు రాజీనామా చేశారు. మరికొందరు బదిలీలయ్యారు. వైద్యులు లేని సమయంలో స్టాఫ్ నర్సులను నియమిస్తాం. రోగులను నిరంతరం వైద్య అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

–సిద్దప్ప, డిప్యూటీ డీఎంహెచ్ఓ

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చెక్కు అందజేస్తున్న విజయ్‌కుమార్

గట్టు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం చాగదోనలో రైతులు చిన బొడ్డన్న, వజ్రమ్మలు మృతి చెందగా రైతుబీమా ద్వారా రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులకు ఆయన చెక్కులను అందజేసి మాట్లాడారు. రైతుబీమా పథకం పేద రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. రాష్ట్ర సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నామన్నారు. కార్యక్రమంలో సుబాన్, గూరన్న, ఈరన్న, జయరాంగౌడ్, నర్సింహులు, అశోక్, రవి, భాస్కర్, ఈరన్న, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బ్యాంక్ మేనేజర్‌లు, మండల పరిషత్ అధికారులు దరఖాస్తులను పరిశీలించారు. వెంకటాపురం ఇండియన్ బ్యాంక్ పరిధిలోని 23 మంది దరఖాస్తు చేసుకోగా 17 మంది అభ్యర్థులు హాజరయ్యారు. గట్టు ఎస్‌బీఐ బ్యాంక్ పరిధిలో 13 మంది దరఖాస్తు చేసుకోగా 7 మంది, ధరూరు ఏపీజీవీ బ్యాంక్ పరిధిలో రెండు దరఖాస్తులు ఇద్దరు హాజరయ్యారు. అదేవిధంగా మాచర్ల యూనియన్ బ్యాంక్ పరిధిలోని 2 దరఖాస్తులకు ఇద్దరు అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 40 మందికి 28 మంది ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ మమ్మద్ అజార్ మోహిద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ సయ్యద్‌ఖాన్, వివిధ శాఖల బ్యాంక్ మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఎస్ ఆయకట్టు పొలాలకు నీరందించాలి



ఆర్డీఎస్ కాలువను పరిశీలిస్తున్న నాయకులు

అయిజ: ఆర్డీఎస్ ఆయకట్టు పొలాలకు సాగునీరు పంపిణీ చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్ అన్నారు. బుధవారం బుధవారం తొత్తినోనిదొడ్డి శివారులో ఆర్డీఎస్ కాలువను పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం శేఖర్ మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన పంట ఎండిపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నా ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని విమర్శించారు. పంటలు ఎండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గోపాల కృష్ణ, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు నర్సన్‌గౌడ్, రమేష్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి



సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మల్దకల్: ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి, ఇంకుడుగుంత తప్పనిసరి ఏర్పాటు చేసుకోవాలని ఎంపీఓ ప్రవీణ్ కుమార్‌రెడ్డి సూచించారు. స్వచ్ఛభారత్ మిషన్ ఫేజ్ 2లో భాగంగా బుధవారం మండలంలోని శేషంపల్లిలో సర్పంచు ప్రతాప్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు మరుగుదొడ్ల వినియోగంపై శిక్షకుడు పరుషరాం అవగాహన కల్పించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో మొత్తం 10 బృందాలు ఏర్పాటు చేసి మరుగుదొడ్లను ఎంత మంది వినియోగించుకున్నారు, తడి, పొడి చెత్త వేర్వేరు చేసి ట్రాక్టర్లలో వేస్తున్నారా లేదా అని సర్వే చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సరిత, హారిక, భాగ్యలక్ష్మీ, మారెప్ప, అయ్యప్పరెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిని విజయవంతం చేద్దాం

గట్టు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేద్దామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు బలరాం కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి సందర్భంగా సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా సమితి జిల్లా అధ్యక్షుడు రంజిత్‌కుమార్, కన్వీనర్ బుచ్చిబాబులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి మండల ఉపాధ్యక్షుడు దయాకర్, కార్యదర్శి నరేష్, ఆలూరు వెంకట్రాములు, ఉలిగప్ప, వీరన్న, శివన్న, హనుమంతు, నర్సింహా, మల్దకల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి రిమాండ్

ఉండవెల్లి: మండలంలోని మైనర్ బాలిక(14)ను పెద్ద పోతులపాడు గ్రామానికి చెందిన అశోక్(20) ప్రేమ పేరుతో గతేడాది ఏప్రిల్ నెల 23వ తేదీన అసభ్యకరంగా ప్రవర్తించాడు. అప్పట్లో బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ జగన్ మోహన్ కేసు నమోదు చేశాడు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 10న బాలికను భరోసా కేంద్రానికి పంపించి స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు. బుధవారం అశోక్‌ను గద్వాల కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

అలంపూర్: ఇంటింటికి సీపీఐని విజయవంతం చేద్దామని నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పెద్ద బాబు కోరారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఇంటింటికి సీపీఐ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 14వ తేదీన హైదరబాద్‌లో ప్రారంభమవుతుందని మే 14న కొత్తగూడెంలో ముగిస్తుందని పేర్కొన్నారు. ప్రభుదాసు, రాజు, తదితరులు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం



అయిజ: మండలంలోని ఉప్పల క్యాంపు గ్రామానికి చెందిన వాతమన్న(57) అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ నరేష్‌కుమార్ వివరాల ప్రకారం 2022వ సంవత్సరం డిసెంబర్ 23వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఐదు సంవత్సరాలనుంచి వాతమన్నకు మతి స్థిమితం సరిగా లేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఫలితం దక్కకపోవడంతో బుధవారం కుమారుడు ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంటుకున్న మంటలు



అలంపూర్: మున్సిపాలిటిలోని పాత పెట్రోల్ పంపు వద్ద రోడ్డు పక్కన ఉన్న గడ్డి నుంచి బుధవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మంటలు రైతులు ఎండబెట్టిన పొగాకు దోరణాల వరకు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ్మాలు ఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు చెలరేగడంతో వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని చల్లి అదుపుచేశారు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

పైలేరియాపై సర్వే



మానవపాడు: మండలంలోని చెన్నిపాడు ప్రాథమిక పాఠశాలలో బుధవారం డాక్టర్ రిజ్వానా తాన్వీర్ ఆధ్వర్యంలో పైలేరియాపై సర్వే నిర్వహించారు. డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ ఏజిలార్సన్, డాక్టర్ ఇర్షాద్ అధ్యక్షతన విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 మందికి పైలేరియా పరీక్ష చేయగా ఎవరికి అటువంటి లక్షణాలు లేనిని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్యానారాయణ, ఏఎన్ఎంలు రాణి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అన్ని మతాలకు ప్రాధాన్యం



అయిజ: అన్ని మతాలకు ప్రాధాన్యం బీఎస్పీ ప్రాధాన్యం ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌కు ఆయన హాజరై మాట్లాడారు. ప్రవక్త బోధనలు అనుసరణీయమన్నారు. పండుగలను అందరూ సంతోషంగా జరుపుకోవాలని కోరారు. అనంతరం మత పెద్దలను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కేశవరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న ఎస్సై వెంకటస్వామి

ఎర్రవల్లిచౌరస్తా: సైబర్ నేరాలపై అప్రమత్తం ఉండాలని కోదండాపురం ఎస్సై వెంకటస్వామి అన్నారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని వల్లూరులో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా షీ టీమ్, పోలీస్ కళా బృందం సభ్యులు గ్రామస్తులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, రోడ్డు భద్రతా నిబంధనలు, షీ టీమ్స్, డయల్ 100, పోలీస్ చట్టాలపై పాటలు, ఆట రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కి లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అపరిచిత వ్యక్తుల జాగ్రత్తగా ఉండాలని గుర్తుతెలియని వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కి సమాచారం అందించాలన్నారు. ఎక్కడైనా విద్యార్థులు, మహిళలు వేధిపులకు గురైతే షీ టీమ్ నంబర్లను 8712670312, 799313139 ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో షీ టీమ్, కళాబృందం సభ్యులు రాధమ్మ, రాంరెడ్డి, శేషన్న, కృష్ణ, రామాంజనేయులు, దివ్యవాణి, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

అంధత్వ నివారణకే కంటి వెలుగు



అరగిద్దలో కంటి పరీక్ష చేయించుకుంటున్న పీఏసీఎస్ చైర్మన్



పెద్దపోతులపాడులో..

గట్టు: అంధత్వ నివారణకే కంటి వెలుగు నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్ అన్నారు. బుధవారం అరగిద్దలో కంటి వెలుగు శిబిరాన్ని వైద్యాధికారి తిమ్మప్పతో కలిసి ఆయన ప్రారంభించారు. అదేవిధంగా ఇందువాసిలో కంటి వెలుగును ఏర్పాటు చేశారు. రెండు గ్రామాల్లో మొత్తం 302 మందికి కంటి పరీక్షలను నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. 14 మందికి కంటి అద్దాలను పంపిణీ చేయగా, 18 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, నర్సింహులు, హెల్త్ సూపర్‌వైజర్లు మక్బూద్, స్వర్ణలత, ఏఎన్ఎంలు విఘ్నేశ్వరి, తాహేరా, ఈశ్వరమ్మ, మధుసూదన్‌రెడ్డి, గద్దం బసన్న, హనుమన్న, జయన్న, కావలి నర్సింహులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని పెద్దపోతులపాడు ఆరోగ్య కేంద్రంలో బుధవారం కంటి వైద్య పరీక్షలను డాక్టర్ యాకుబ్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. నాల్గో రోజు 149 మందికి కంటి పరీక్షలు, 8 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. నలుగురికి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపించనట్లు వైద్యులు పేర్కొన్నారు. వైద్య సిబ్బంది చంద్రన్న, శ్రావణి, లక్ష్మీనారాయణ, శారద, చిట్టెమ్మ, ఆశలు పాల్గొన్నారు.

క్రీడలతో బంగారు భవిష్యత్



బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ శ్యామల

గట్టు: క్రీడలతో బంగారు భవిష్యత్ ఉంటుందని జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హనుమంతునాయుడు అన్నారు. బుధవారం దిగంబరస్వామి జాతర సందర్భంగా మండలంలోని బల్గెరంలో క్రికెట్ టోర్నీ ఏర్పాటు చేశారు. విజేతలకు దాతలు ముందుకు వచ్చి బహుమతులు సమకూర్చారు. మొదటి బహుమతికి రూ.40వేలు జెడ్పీటీసీ బాసు శ్యామల, ద్వితీయ బహుమతి ఎంపీటీసీ రూపవతి రూ.25వేలు, తృతీయ బహుమతి రూ.15వేలు ఉపాధ్యాయుడు రంగన్న సహకారం అందించారు. టోర్నీ ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి స్థానంలో గట్టు రేంజర్, రెండో స్థానంలో జీఆర్‌జీఎం, మూడో స్థానంలో పంచముఖ జట్టు నిలిచాయి. కార్యక్రమంలో నూర్‌పాషా, బాసు నాయుడు, గట్టు రమణ, బాసు గోపాల్, రామకృష్ణ, గట్టు సాయి, రమేష్, కేబీ తిమ్మప్ప, రాజగోపాల్, ఈరన్న, నాగరాజు, డీఆర్ నాయుడు, వీరారెడ్డి, ఈరన్న బుగ్గల్, వినోద్ పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం ఖూనీ



మాట్లాడుతున్న పటేల్ ప్రభాకర్ రెడ్డి

గద్వాల అర్బన్: కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా ఎంపీగా అనర్హత వేటు వేసిందని ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు, రాహుల్ గాంధీకి మద్దతుగా ఈనెల 14న మంచిర్యాలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లా నుంచి అన్ని వర్గాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలం

గద్వాల అర్బన్: నీళ్ల, నిధులు, నియమాకాల పేరిట అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ అతిఖుర్ రహ్మాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఆ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అతిఖుర్ రహ్మాన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. వెంటనే ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని, నిరుద్యోగ భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసి నాయకులు శాస్త్రీ, ప్రకాష్, నర్సన్న, తదితరులు ఉన్నారు.

శానిటైజేషన్, ఇన్సినేటర్ మిషన్ల పంపిణీ



మిషన్‌లను ప్రారంభిస్తున్న సర్పంచ్, ప్రిన్సిపాల్

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలకు ఎస్‌బీఐ సంజీవని సంస్థ సమకూర్చిన శానిటైజేషన్ మిషన్, ఇన్సినేటర్ మిషన్లను బుధవారం సర్పంచు రేఖ, ప్రిన్సిపాల్ పద్మావతి అందజేసి ప్రారంభించారు. ప్రారంభించారు. రెండు మిషన్లు రూ.60 వేలు విలువ ఉంటుందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు సంస్థ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హవాలా రాణి, ఉమ్మడి జిల్లా అకాడమిక్ కోఆర్డినేటర్ సలీం, ఎస్‌బీఐ సంజీవని సిబ్బంది నాగరాజు, ఏఎన్ఎం షాజహాన్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

మల్దకల్: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని డాక్టర్ స్వరూపరాణి అన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారంతో తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఎండాకాలంలో వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. హెల్త్ సూపర్‌వైజర్ సత్యమ్మ, ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.